
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 141 వ భాగం

## సూర్య వంశం – 9 ; కల్మాషపాదుడు

వసుదాసుడనే సూర్యవంశపు రాజు కల్మాషపాదుడు అయ్యాడు కదా, కానీ వశిష్టుడు ఇచ్చిన శాపం పోలేదు కనక రాక్షసుడయ్యాడు – అదీ పన్నెండేళ్ళకి మాత్రమే – అని సరిదిద్దిన శాపం తో. ఈయన రాజుగా ఉన్న రోజుల్లో మిత్రసహుడు అంటే స్నేహార్ధ హృదయుడు; ప్రస్తుతం రాక్షసుడయ్యాడు.

వ. ఇట్లు మిత్రసహుండు గావునఁ గళత్రానుకూలుండై శపియింప నొల్లక సుదాసుండు రాక్షస భావంబు నొంది, కల్మషవర్ణంబు లయిన పాదంబులతో నడవులం దిరుగుచు. [9-240]

క. ఆఁకట మలమల మాఁడుచు
వీఁక నతం డడవి నున్న విప్ర మిథునముం
దాఁకి తటాలున విప్రునిఁ
గూఁకటి చేఁబట్టి మ్రింగఁ గొనిపోవుతఱిన్. [9-241]

అడవుల్లో తిరుగుతూంటే తిండికి మాడుతున్నాడు. ఓ సారి అక్కడ కనిపించిన విప్రులైన భార్యా భర్తలని పట్టుకున్నాడు తినడానికి. భయపడిపోయిన ఆ విప్రుని భార్య గుండెలు బాదుకుంటూ, అడ్డం వచ్చి ఏడుస్తూ రాక్షసునితో ఇలా అంటోంది. ఈ పద్యంలో "విప్రులు" అనేది ఎందుకు వాడారో తర్వాత తెలుస్తుంది మనకి కథలో.

క. మానుషదేహము గలుగుట
భూనాయక! దుర్లభంబు పుట్టినమీఁదన్
దానముఁ బరోపకారము
భూనుతకీర్తియును వలదె పురుషున కెందున్? [9-243]

మానవదేహం అనేది ఎన్నో జన్మల తర్వాత కానీ కలిగేది కాదు, అత్యంత దుర్లభం. అలా మానవదేహం వచ్చిన తర్వాత దానం, పరోపకారం అనేవి చేస్తూ ఉండాలి. వాటివల్ల కీర్తి లభిస్తుంది కదా? ఇదే విషయం – మానవదేహం కలగడం అత్యంత దుర్లభం — అనేది రమణులు, శివానంద సరస్వతి వంటి అనేకానేకులు చెప్పడం గమనించవచ్చు. హిందూ మతం ప్రకారం, దీనికి కారణం ఏమిటంటే, మానవ జీవితం మాత్రమే, ఏది మంచిది, ఏది మంచిది కాదు అనే విచక్షణ కలిగి ఉండడం. ఈ విచక్షణ లేనివి రాక్షస గణాలు. అనేకానేక రాక్షస గుణాలు కలిగిన జీవితాలు కలిగాక, ఒక్కో మెట్టూ ఎక్కుతూ మానవ జన్మ కలగడానికి అవకాశం ఉంది. ఒకసారి మానవ జన్మ కలిగాక మంచి పనులు చేస్తూ మరోసారి కింది రాక్షస గుణాలు ఉన్న జన్మలకి జారకుండా దానం, పరోపకారం అనేవి చేస్తూ భగవంతుణ్ణి చేరడానికి ప్రయత్నం చేయాలి. ఇదే అవిడ చెప్పినది. కానీ ఇక్కడ సుదాసుడు రాక్షసుడు; ఆవిడ చెప్పిన మాట వింటాడా?

మ. **<u>రవి వంశాగ్రణివై</u>** సమస్తధరణీరాజ్యాను సంధాయివై
భువనస్తుత్యుఁడవై పరార్థరతివై పుణ్యానుకూలుండవై
వివరంబేమియు లేక నా పెనిమిటిన్ విప్రుం దపశ్శీలు స
త్ప్రవరున్ బ్రహ్మవిదున్ జగన్నుతగుణున్ భక్షింపఁగాఁ బాడియే? [9-244]

ఈ విప్రుడి భార్య మామూలు మనిషి కాదు. తపశ్శక్తి కలది కనక ఈ రాక్షసుడు ఎవరో కూడా తెలుసు ఆవిడకి. నువ్వు సూర్య వంశానికి చెందిన రాజువి (రవి వంశాగ్రణివై), భూమండలం అంతా ఏలడానికి సమర్థుడవి (సమస్తధరణీరాజ్యాను సంధాయివై), భువనాలన్నీ కీర్తించేవాడివి (భువనస్తుత్యుఁడవై). అయినా మా ఆయన ఏ తప్పూ చేయలేదు; ఆయన బ్రహ్మవేత్త, సత్ప్రవర్తన కలవాడు. ఆయన్ని చంపి తినడం న్యాయమేనా? ఏమంటోందో గమనించారా? నువ్వు రాక్షస రూపం పొందినా మంచివాడివి, సూర్యవంశానికి చెందినవాడివి సుమా, అని గుర్తు చేస్తోంది. అవన్నీ వింటాడా ఆకలికి దాసోహం అంటాడా?

శా. తండ్రీ! మీకు **దినేశవంశజులకున్** దైవం బగున్ బ్రాహ్మణుం
డంద్రా మాటలు లేవె? భూమిసుర గోహత్యాభిలాషంబు గై
కొండ్రే మీ యటువంటి సాధువులు? రక్షోభావ మిట్లేల? మీ
తండ్రిం దాతలఁ బూర్వులం దలఁపవే ధర్మంబునుం బోఁగదే. [9-245]

మీ వంశజులకి – అదే సూర్యవంశ రాజులకి (దినేశవంశజులకున్ – దినేశుడు, దినము, లేదా పగలుకి రాజు, సూర్యుడు) – విప్రులంటే దైవంతో సమానం అంటారు కదా? అటువంటి మీరు రాక్షస భావం పొంది ఇలా బ్రహ్మ హత్యాపాతకం కొని తెచ్చుకోవడం దేనికి? ఒకసారి మీ తండ్రీ తాతలు, పూర్వులు ఏం చేసారో గుర్తు తెచ్చుకుని ధర్మమార్గంలో వెళ్ళడం మంచిది కదా? **సూర్యవంశాన్ని** పోతన అనేక పేర్లతో వివరించడం గమనిస్తున్నారా?

శా. అన్నా! చెల్లెల నయ్యెదన్; విడువు నీకన్నంబు బెట్టింతు;
నా హృన్నాథున్ ద్విజు గంగికుఱ్ఱి నకటా! హింసింప నేలయ్య? నీ
వెన్నం డింతులతోడఁ బుట్టవె? నిజం బిట్టైన మున్మట్ట నా
పన్నన్ నన్ను శిరంబు ద్రుంచి మఱి మత్ప్రాణేశు భక్షింపవే. [9-246]

పోనీ అవన్నిన్నీ వదిలేసి నా గురించి ఆలోచించు. నేను నీ చెల్లెలు వంటిదాన్ని. నీకు ఆకలే ఎక్కువైతే నీకు ఆహారం పెట్టిస్తాను. నా భర్తని – విప్రుణ్ణి, గంగిగోవులాంటి (గంగికుర్రి) వాడిని హింసించడం దేనికి? నీకు అక్కచెల్లెళ్ళు లేరా (ఇంతులతోడబుట్టవె). అబ్బే కుదరదు ఈయన్ని తినాలి అంటావేమో. అలాగైతే ముందు నా శిరస్సు తుంచేసి తర్వాత ఆయన్ని తిను. కనీసం నేను ఆయన చావు చూడక్కర్లేదు.

క. అని కరుణ పుట్ట నాడుచు
వనితామణి పలవరింప వసుధాదేవుం
దినియె నతఁడు పులి పశువుం
దిను క్రియ శాపంబు కతన ధీరహితుండై. [9-247]

ఆ వనితామణి కరుణ పుట్టడానికి ఇంత చెప్పినా రాక్షసుడైన సుదాసుడు, లేదా కల్మాషపాదుడు మనసు కరగలేదు. ఆ విప్రుణ్ణి (వసుధా దేవుడు) పులి పశువుని తిన్నట్టూ తినేసాడు. ఎందుకలా చేసాడంటే, శాపం వల్ల కరుణ అనేది పోయి రాక్షసుడయ్యాడు కనక అని చెప్పుకోవాల్సిందే.

వ. అంత నా బ్రాహ్మణి గోపించి "కామార్తనయిన నాదు పెనిమిటిని భక్షించితివి గావున నీవు నెలంతలం బొందఁ జేరినవేళ మరణంబుఁ బొందు" మని కల్మాషపాదుని శపించి, పతిశల్యంబులతో నగ్నిప్రవేశంబు జేసి సుగతికిం జనియె; నంతఁ బండ్రెండేండ్లు చనిన నా రాజు మునిశాపనిర్ముక్తుండై. [9-248]

ఇదంతా చూసింది విప్రుడి భార్య. కోపం వచ్చి శపించింది భర్తతో సహగమనం చేస్తూ – మేము ఇద్దరం కలిసి ఉన్నపుడు ఆయన్ని చంపావు కనక నువ్వు కూడా ఎప్పుడైతే భార్యని కోరుతావో అప్పుడు ఛస్తావు. పోతన ఈ భార్యా భర్తలని "విప్రులు" అని ఎందుకు సంబోధించాడో ఇప్పుడు అర్థం అయింది కదా? భర్తని పట్టుకున్న వెంటనే ఆవిడ శపించేయలేదు. ఆవిడ సహనంగా, అన్నీ వివరించి – మీ వంశం ఎంత మంచిది, దయచేసి మా ఆయన్ని వదిలేయి, నేను నీ చెల్లెలు వంటిదాన్ని అని బతిమాలింది. ఈయన వినలేదు. ఇంతవరకూ వచ్చింది కనక కోపం వచ్చి తన తపశ్శక్తి తో శపించింది. అందుకే బ్రహ్మవేత్తల గుణాలని చెప్పేటప్పుడు మొదట సహనం అలవర్చుకుంటారని చెప్పేది. అది రానంతవరకూ బ్రహ్మ జ్ఞానం కలగడం అసంభవం. అయినా ఆవిడ తన భర్తని వదలకుండా తన ముందే  పులి పశువుని తిన్నట్టూ తినేసినందుక్కూడా 'తలపగిలి వెంటనే చచ్చిపో' అని శాపం పెట్టలేదు. ఆవిడకి ఈ రాజు గురించి తెలుసని చెప్పుకున్నాం (నువ్వు సూర్యవంశానికి చెందినవాడివి కదా అని అన్నప్పుడు). అందువల్ల రాజు లేకుండా రాజ్యం సాగదనీ, ఈయన చావడం కుదరదనీ, ఈయన గురువు వశిష్టుడనీ కూడా తెలుసు కాబోలు. అందుకే నువ్వు భార్యని కలిస్తే ఛస్తావు అంది తప్ప వెంటనే ఛస్తావు అనలేదు.  ఇదే మనం రావణుడి విషయంలో కూడా చూడవచ్చు.  వాడు వేదవతిని చెరపట్టనంతవరకూ ఆవిడ వీణ్ణి పట్టించుకోలేదు, ఇంకా అప్సరసలూ, సీతా కూడా ఒరే నువ్వు పులస్త్య బ్రహ్మ కొడుకువి ఇలా చేయకూడదు అని సహనంతో వారించారు తప్ప చివరి వరకూ వాణ్ణి శపించలేదు. శపించినవారు కూడా 'నువ్వు వెంటనే ఛస్తావు' అనలేదు; మరోసారి ఇలా చేస్తే ఛస్తావు అన్నారు. అదే వీళ్ళలో ఉన్న సహనం. అందుకే వాళ్ళు విప్రులు.

ఇదంతా చదువుతూంటే రామాయణంలో దశరథుడు, మహాభారతంలో పాండురాజు గుర్తు వచ్చారా? వారికీ ఇటువంటి శాపమే అయితే వాళ్ళిద్దరూ కూడా అనుకోకుండా చేసిన తప్పు అది. కానీ ఇక్కడ కల్మాషపాదు తెలిసీ,

హెచ్చరించబడి కూడా పట్టించుకోకుండా చేసిన తప్పు. అయితే పన్నెండేళ్ళు ఇలా రాక్షస రూపం గడిచాక శాపం తీరి రాజ్యానికి వచ్చాడు మరోసారి.

ఆ. రతులకొఱకు నాలి రావింప నదియును
బెదరి విప్రసతి శపించు టెఱిఁగి
మగని నడ్డపెట్టి మైథునకర్మంబు
మాన్చె సతుల గోష్ఠి మానె నతడు. [9-249]

రాక్షస రూపంలో ఏం జరిగిందో గుర్తు లేదేమో రాజుకి. ఇంటికొచ్చాక భార్యని చేరబోయేడు. ఆవిడకి ఈ రాక్షస రూపంలో ఉన్న భర్తకి ఏం జరిగిందో తెలుసు – అందువల్ల బెదిరిపోయి ఆ శాపం గుర్తు చేసింది, ఛస్తావు సుమా అంటూ. ఈయన కూడా ఆ విషయం గుర్తు పెట్టుకుని భార్యని కలవడం మానుకున్నాడు. ఇప్పుడో ధర్మ సంకటం. రాజు భార్యతో కలవకూడదు కనక ఆయనకి ఎటువంటి పిల్లలూ పుట్టరు. అయితే తర్వాత రాజ్యం చేసేది ఎవరు?

సుదాసుడు ఈ విషయం, తన శాపం విషయం వశిష్టుడి దగ్గిర ప్రస్తావించాడు. వశిష్టుడు తన తపోబలంతో, లేదా యోగ దృష్టితో ఆవిడకి గర్భం కలిగేలా చేసాడు. మహాభారతంలో కూడా ఇటువంటి కథే కనిపిస్తుంది మనకి. వ్యాసుడు తన తల్లి అయిన సత్యవతి కోరిక మీద అంబ, అంబాలిక అనే విచిత్రవీర్యుని భార్యలిద్దరికీ పుత్రులు కలిగేలా చేయడం. అలా పుట్టిన వారే పాండురాజు, ధృతరాష్ట్రుడు, విదురుడు అనేవారు.

వ. ఇట్లు సుదాసుని భార్య యగు మదయంతి వసిష్ఠునివలన గర్భిణి యై యేడేండ్లు గర్భంబు ధరించి నీళ్ళాడ సంకటపడుచున్న వసిష్ఠుండు వాఁడి యగు నశ్మంబున నా గర్భంబుఁ జీరిన నశ్మకుం డను కుమారుండు పుట్టె; నతనికి మూలకుండు పుట్టె; నతండు. [9-251]

క. వీరుఁడగు పరశురాముఁడు
ఘోర కుఠారమున నృపులఁ గూలుచు వేళన్
నారీజనములు దాఁచిన
నారీకవచుం డనంగ నలి నుతి కెక్కెన్. [9-252]

సుదాసుడి భార్య మదయంతి (ఈవిడే, సుదాసుడితో గురువుని శపించకు అని వారించింది) గర్భం ధరించి ఏడేళ్ళు అయినా ఎవరూ పుట్టలేదు. సూది అయిన రాయితో (వాడి యగు నశ్మంబున) శస్త్రం చేసాడు వశిష్టుడు. అప్పుడు అశ్మకుడు అనేవాడు పుట్టాడు. ఈ అశ్మకుడి కొడుకు మూలకుడు. ఇలా మూలకుడు అని పేరు పెట్టడానిక్కూడా కారణం ఉంది. పరశురాముడు రాజులని వరసపెట్టి చంపేస్తున్నప్పుడు ఈ మూలకుణ్ణి ఇంట్లో నారీజనం దాచారు ఆడవేషం వేయించో, మరో విధంగానో. అలా నారీమణులచేత రక్షించబడ్డాడు కనక మూలకుణ్ణి నారీకవచుడు అనేవారు. సూర్యవంశం అంతరించిపోకుండా ఉండడానికి ఈయన కారకుడు (వంశానికి మూలం) కనక ఈయనని మూలకుడు అనేవారు.

ఈ మూలకుడికి కొడుకు విశ్వసహుడు, ఆయన పుత్రుడు ఖట్వాంగుడు. రాముడు పుట్టడానికి మరో నాలుగు తరాలు ఉంది కథ. భగవంతుడు ఓ వంశంలో పుట్టాలంటే మెల్లగా వంశం అంతా పరిశుభ్రం అవుతూ ధర్మానికి ప్రాణం ఇచ్చే రాజులు వరసగా పుట్టాక ఆయన వస్తాడు. అప్పటి వరకూ ఒకరి తర్వాత ఒకరుగా వంశం సాగుతుంది. అయితే ఆ అవతారం చాలించాక ఆశ్చర్యంగా ఆ వంశంలో రాజులు కూడా ధర్మం తప్పి ప్రవర్తించడం, పిరికివాళ్ళుగా అవడం అన్నీ కనిపిస్తాయి. అవన్నీ తర్వాత 'భవిష్యత్ రాజేంద్రులు' అనేచోట భాగవతంలో చూడవచ్చు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS